




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

'స్మార్ట్' దోపిడీ..!



ట్యాబ్‌లు పోయి టీవీలొచ్చె
కార్పొరేట్ కంపెనీల లబ్ధికేనా..?
విద్యాశాఖలో 'వింత' పోకడ

విద్యా శాఖలో స్మార్ట్ పేరుతో దుబారా తీరు తీవ్ర విమర్శల పాలవుతోంది. పాఠశాలల్లో విద్యార్థులకు ఇదివరకు ఇచ్చిన ట్యాబ్లు మరమ్మతుకు గురవుతున్న నేపథ్యంలో వాటిని రిపేర్ చేయాల్సింది పోయి, వాటికి బదులుగా తరగతి గదుల్లో స్మార్ట్‌టీవీలను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఓవైపు పాఠశాలల నిర్వహణ కోసం విడుదల చేయాల్సిన గ్రాంట్లు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసింది. మరోవైపు బడాయి కోసం వేలాది రూపాయల స్మార్ట్ టీవీలను స్కూల్స్‌కి ఇచ్చేందుకు మాత్రం వెనుకాడకపోవడం శోచనీయం. ఓ వైపు సుద్దముక్కలకు గతి లేకున్నా...ప్రభుత్వానికి ఈ "స్మార్ట్ బడాయి" ఎందుకంటూ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అయినా ప్రభుత్వ తీరులో మార్పు లేకుండా ముందుకు వెళుతూ పాఠశాలలు, జిల్లాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండటం విడ్డూరం. ఇదంతా ఓ కార్పొరేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకే అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - తిరుపతి

విద్యా సంవత్సరం పున్ణప్రారంభమై నెల గడిచిపోయింది. కొత్తగా ఈ విద్యా సంవత్సరం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీల బోధన అంటూ ఖరీదైన పరికరాలు పాఠశాలలకు పంపి వాటి ద్వారా విద్యా బోధన చేయాలని ఆదేశించడంతో గతేడాది ఇచ్చిన ట్యాబ్లను పక్కన పెట్టేస్తున్నారు. ఇప్పటికే కొన్ని సాఫ్ట్వేర్ సమస్యతో పని చేయట్లేదు. నిర్వహణ పరమైన సమస్యలతో మరికొన్ని పని చేయడం లేదు. స్మార్ట్ టీవీలపై దష్టి పెట్టిన విద్యాశాఖ యంత్రాంగానికి ట్యాబ్లపై పర్యవేక్షణ లోపించిం దనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లోనే వినిపిస్తోంది. ట్యాబ్లో ఉన్న కంటెంట్ను ఎలా అప్లోడ్ చేయాలనే దానిపై ఇటీవల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అంతకు మించి వాటి వినియోగంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఉపాధ్యాయులు గందరగోళంలో ఉన్నారు. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొంతమేరకు సిలబస్లోలో మార్పులు చోటుచేసుకున్నాయి. వీటికి అనుగుణంగా కంటెంట్ రూపొందించి తిరిగి ట్యాబ్ ల్లోకి ఎక్కించాల్సి ఉంది. ఇచ్చిన ట్యాబ్ ల్లో ఎన్ని పని చేస్తు న్నాయో, ఎన్ని పని చేయడం లేదో స్పష్ట మైన గణాంకాలు లేవు.

ప్రతి విద్యార్థి నిత్యం ఎన్ని వీడియోలు చూశారు. సిలబస్ కు సంబంధించిన పాఠ్యాంశాలు ఏం చూశారు. కొత్త అంశాలు ఏం నేర్చుకున్నా రని గడిచిన విద్యా సంవత్సరంలో కొంత వరకు సమాచారం సేకరించి హడావుడి చేశారు. దీంతో ప్రతి విద్యార్థి, ఉపాధ్యా యుడు నిత్యం ట్యాబ్ చూసేవారు. రోజు ఏదో ఒక సబ్జెక్టు గంట పాటు అందులోనే బోధించాలని తప్పనిసరి చేశారు. ప్రస్తుతం నిధులు వెచ్చించి అట్టహాసంగా సాంకేతిక పరికరాలు కొనుగోలు చేయడం, తర్వాత వాటిపై పర్యవే క్షణ లేకపోవడంతో విలువైన ప్రజా ధనం వథా అవు తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే మరమ్మత్తుకు గురైన వాటిని సచివాలయం లలో పడేస్తునారే తప్ప వాటిని టెక్నీషియన్ లు లేదంటూ రిపేరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వాటి స్థానంలో ఇప్పుడు స్మార్ట్ టీవీలను తీసుకొచ్చేందుకు సన్నాహాలు మొదలెట్టడాన్ని ఎస్ ఎఫ్ ఐ, యూటీఎఫ్ సంఘాల నేతలు విమర్శిస్తుండటం గమనార్హం.

బిజెపి మోడల్‌గా రాష్ట్రంలో జగన్ పాలన

పోలీసులే గూండాల్లా వ్యవహరిస్తున్నారు
'రౌండ్‌టేబుల్'లో అఖిలపక్షం ధ్వజం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కేంద్రంలో బిజెపి వ్యవహరిస్తున్న నిరంకుశ దోరణికి ఏ మాత్రం తీసిపోకుండా, వారికి మోడల్‌గా రాష్ట్రంలో జగన్ పరిపాలన సాగిస్తున్నారని అఖిలపక్ష సమావేశంలో నాయకులు ధ్వజమెత్తారు. తిరుపతి యశోదనగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అధ్యక్షతన 'తిరుపతి జిల్లాలో పోలీసుల అరాచకాన్ని ఎదుర్కొందాం' అనే అంశంపై బుధవారం అఖిలపక్షంతో రౌండ్‌టేబుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నాయన్నారు. పోలీసు యంత్రాంగం రాజ్యాంగానికి కట్టుబడి ఉండాల్సింది పోయి, నిరసన తెలిపే వారిపై దాడి చేయడం బాధాకరమన్నారు. ఇటీవల శ్రీకాళహస్తిలో వన్‌టౌన్ సిఐ అంజుయాదవ్ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న జనసేన కార్యకర్తలపై దాడి చేసి, మీడియా ఎదుటే ఓ కార్యకర్త చెంపచెల్లు మనిపించిందన్నారు. జనసేన అధ్యక్షుడే స్వయంగా తిరుపతికి వచ్చి ఎస్‌పికి పిర్యాదు చేస్తే దీన్నిపై జిల్లా పోలీసు అధికారి ఒక ప్రకటన కూడా చేయకపోగా సిఐకి వత్తాసు పలికేలా వ్యవహరించడం శోచనీయమన్నారు. వెంకటగిరిలో అన్నాచెల్లెలు ఒక సమస్యపై స్టేషన్‌కు వస్తే ఎస్‌ఐ వారిపైనే దాడి చేయడం బాధాకరం అన్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు సూళ్లురుపేట, నాయుడు పేట, బుచ్చినాయుడు కండ్రిగ, తిరుచానూరు, రేణిగుంట ఇలా జిల్లాలో పోలీసులు తీరు ఆక్షేపనీయమన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టాలంటే ఐక్య ప్రజా ఉద్యమాలు అవసరమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పోలీసులే గూండాల్లా తయారయ్యారన్నారు. చంద్రగిరిలో ఇసుక మాఫియా జరుగుతుందని అడ్డుకున్న టిడిపి నాయకులపైనే పోలీసులు అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఒక సిఐ తీరుపై సాక్షాత్తు ఓ పార్టీ అధ్యక్షులు తిరుపతికి వచ్చి ఎస్‌పికి పిర్యాదు చేసి మూడు రోజులైన ఇప్పటి వరకు చర్యలు శూన్యమన్నారు. ఆర్‌పిఐ దక్షణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ పోలీసుల అరాచకాలపై పిహెచ్‌డికి అనుమతి ఇస్తే కనీసం 10 పిహెచ్‌డిలకు సరిపోయే రిపోర్టు అందుబాటులో ఉంటుందని ఎద్దేవా చేశారు. చీరాలలో దళితుడైన కిరణ్ మాస్కు పెట్టుకోలేదని ఎస్‌ఐ కొట్టి చంపాడని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడి ఓ అంతర్జాతీయ కుట్రవాధి అని ఎద్దేవా చేశారు. అలాంటి వారికి వత్తాసు పలికేలా రాష్ట్రంలో అధికారపార్టీ వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీలే తమకు అన్యాయం జరుగుతుందని చెప్పుకుంటున్న పరిస్థితులు నేడు దాపురించాయన్నారు. సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, జయచంద్ర, నరేంద్ర, సాయిలక్ష్మీ, జయంతి, ఆర్.లక్ష్మీ, హేమలత, వేణు, మునిరాజ, మాదవ్, ఓ.వి.రమణ, సిపిఐ విశ్వనాథ్, కాంగ్రెస్ శివశంకర్, జనసేన నాయకులు మునస్వామి, సిపిఐ(ఎంఎల్) నాయకులు ముని పాల్గొన్నారు.



వరిని నష్టపరుస్తున్న నల్లి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

జిల్లాలో ఖరీఫ్‌కు ముందు సాగు చేసిన వరి పంటను నల్లి ఆశించి నష్టపరుస్తోందని తిరుపతి ఎడిఎ మెరుగు భాస్కరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కంటికి కనబడని ఈ పురుగులు ఆకులను ఇరువైపులా సన్నని గూళ్లు చేసుకుని ఆకుల నుంచి రసాన్ని పీల్చేస్తాయన్నారు. దీంతో ఆకుల పైభాగాన తెలుపు, లేత పసుపు రంగు చారలు కన్పిస్తాయని తెలిపారు. ఆకులలో పచ్చదనం పోవడం వల్ల పంట అంతా పాలిపోయినట్లు కనిపిస్తోందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పురుగుల ఉధృతి అధికంగా ఉందన్నారు. ఈ పురుగు ఉనికిని గమనించిన వెంటనే డైకోఫాల్ (600 మి.లీ) లేదా ప్రొఫినోఫాస్ (400 మి.లీ.) లేదా ఓమైట్ (400 మి.లీ) లేదా ఓబెరాన్ (200 మి.లీ) మందులలో ఒక దానిని ఎకరాకు 200 లీటర్ల నీటితో కలిపి స్ప్రే చేయాలని తెలిపారు.

చంద్రగిరిలో 50 వేలకు పైగా బోగస్ ఓట్లు నమోదు

తిరుచానూరు: చంద్రగిరి నియోజకవర్గంలో 50వేలకు పైగా బోగస్ ఓట్లు నమోదయ్యాయని పులివర్తి సుధా విమర్శించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. టిడిపితో పాటు బిజెపి, జనసేన, సిపిఐ, సిపిఎం పార్టీల నేతలు హాజరయ్యారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ గైర్హాజరయ్యింది. ఓటరు జాబితాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం పులివర్తి సుధారెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో 2019లో 325 పోలింగ్ బూతులు ఉంటే, ఎవరి ప్రమేయం లేకుండా 63 బూత్‌లు అదనంగా పెంచారన్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే 50వేలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని విమర్శించారు. ఒక్క డోర్ నంబర్‌పై 20-100 ఓట్లు ఉన్నాయని, మొత్తం ఇలాంటివి ఎనిమిదివేల ఓట్లు ఉన్నాయని తేలిందన్నారు. ఆమెతో పాటు నాయకులు మునిరత్నం రెడ్డి, దామా సాయి పాల్గొన్నారు.



అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోండి

జేఎన్టీయూఏ విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అధ్యాపకులు, విద్యార్థులు మారుతున్న సాంకేతికతను అనుసరిస్తూ వాటి మెలుకువలపై శిక్షణ పొందడం చాలా అవసరమని జేఎన్టీయూఏ వైస్ చాన్స్ లర్ రంగ జనార్ధన అన్నారు. బుధవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ' సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీలపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను వీసీ రంగాజనార్ధన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నేడు సాంకేతికత కొత్త మార్పులు తీసుకువస్తుందని



దానికి అనుగుణంగా అధ్యాపకులతో పాటు విద్యార్థులకు మంచి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రోగ్రాం కన్వీనర్లుగా డాక్టర్ ఆర్. స్వాతి, కో కన్వీనర్ గా డాక్టర్ ఎన్ మురళీకష్ణ వ్యూహరించారు.

'వేమన' చిత్రలేఖనం ఆన్లైన్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వేమన విజ్ఞాన కేంద్రం, శ్రీ కళాక్షేత్ర సంయుక్తంగా నిర్వహిస్తున్న చిత్రలేఖనం పోటీల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వేమన విజ్ఞాన కేంద్రం తిరుపతిలో ప్రారంభించనున్న సందర్భంగా వేమన పద్యాలలోని భావాన్ని వ్యక్తీకరించేలా చిత్రాలు వేయించాలని, 6, 7, 8 తరగతులు ఒకటో కేటగిరీగా, 9, 10, ఇంటర్ రెండో కేటగిరీగా, డిగ్రీ ఆపై తరగతులు మూడో కేటగిరీగా ఆన్లైన్ పోటీలు జరగనున్నాయి. ప్రతి కేటగిరీలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నారు. విద్యార్థులు వేసిన చిత్రాలను ఆన్లైన్‌లో మెయిల్‌కు ఆగస్టు 15కల్లా చేరాల్సి ఉంది. మొదటి, రెండో కేటగిరీలకు మూడువేలు, రెండువేలు, వెయ్యి రూపాయలు ఇవ్వనున్నారు. మూడో కేటగిరీకి నాలుగువేలు, మూడువేలు, రెండువేలు నగదు బహుమతి ఇస్తారు.



పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం

ఉత్తమమైన చిత్రాలతో ఆల్బమ్ తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాళ్లు ప్రత్యేకంగా విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, శ్రీ కళాక్షేత్ర కార్యదర్శి సాగర్, నిర్వాహకులు దామోదరం, రెడ్డెప్ప, నారాయణ, గురునాధం, ఒ.వి రమణ, మునిరామయ్య, ముఖేష్, బాలక్రిష్ణ, ఆనంద్, ద్వారకానాథ్, లావణ్య, వాగ్దేవి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగనన్న కృషి : సుబ్రమణ్యంరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్ర విభజన తరువాత ఆర్థిక ఇబ్బందులతో పాటు అనేక సమస్యలున్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైసిపి నాయకులు సుబ్రమణ్యం రెడ్డి చెప్పారు. జగన్



మంత్రికి వినతి (ఫైల్‌ఫొటో)

నాలుగేళ్ల పాలనపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కుల, మత ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఇంటికి దీపం ఇల్లాలే అన్న నానుడిని దృష్టిలో ఉంచుకుని మహిళా సాధికారతలో భాగంగా వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరి ఇంటి ముంగిటికి సేవలు తీసుకెళుతున్నారన్నారు. ఆస్పత్రులను బలోపేతం చేసి మందులను, చికిత్సలను సామాన్యులు, పేదల చెంతకు తీసుకెళ్లారన్నారు. కరోనా వంటి ప్రమాదకరమైన వైరస్‌ను ధైర్యంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎంఎల్‌ఎ ద్వారకనాథరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



రేపు వెంకటగిరికి సిఎం రాక

భద్రతా ఏర్పాట్లలో కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి -రేణిగుంట, వెంకటగిరి

వెంకటగిరికి ఈనెల 21న శుక్రవారం సిఎం జగన్మోహన్‌రెడ్డి రానున్న నేపథ్యంలో దేగ కన్నులాంటి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎయిర్‌పోర్టులో సిఎం భద్రతపై ఉన్నతస్థాయి అధికారులతో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డిలు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణం అయ్యేవరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి భద్రత కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులెన్స్, సేఫ్ హౌస్, సేఫ్ హాస్పిటల్, ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం వెంకటగిరి పట్టణంలో సిఎం పర్యటించే హెలిపాడ్, బహిరంగసభా వేదిక ప్రాంతాల వద్ద పర్యటించి జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి భద్రతపరంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, జేసీ డికె బాలాజీ, ఎస్‌బి డిఎస్‌పి గిరిధర, గూడూరు డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కమిటీ విచారణకు అర్జున్ దాస్ గైర్హాజరు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

హాథీరాంజీ మఠం మఠాధిపతిగా పలు అక్రమాలకు పాల్పడ్డారని అర్జున్ దాస్ పై రాష్ట్ర దేవాదాయ శాఖ, ధార్మిక పరిషత్ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో బుధవారం తిరుపతి హాథీరాంజీ మఠంలో ధార్మిక పరిషత్ కమిటీ విచారణ జరిగింది. అర్జున్ దాస్ విచారణకు గైర్హాజరయ్యారు. ధార్మిక పరిషత్తు కమిటీ సభ్యులు రిటైర్డ్ ఎండోమెంట్ కమిషనర్ ఏబి. కష్టారెడ్డి, ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, రీజనల్ జాయింట్ కమిషనర్ కు హాథీరాంజీ మఠం ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు సమస్యలను ఏకరువు పెట్టారు. మఠాధిపతిగా అర్జున్ దాస్ చాలా వేధింపులకు గురి చేసేవాడని ప్రభుత్వం అమలు చేస్తున్న పిఆర్ సి, ఇతర బెనిఫిట్లు గాని, పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలేదని వాపోయారు. విచారణ కొనసాగుతోందని పూర్తి నివేదిక వివరాలను త్వరలో తెలియజేస్తామని కమిటీ సభ్యులు మీడియాకు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట/ గూడూరు టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ పిలుపు మేరకు 20న మహిళా కార్మికులు, 21న మున్సిపల్ కార్మికులందరూ నిరసన తెలుపుతారని, 27న మున్సిపల్ ఆఫీసు ముట్టడి, ఆగస్టు 7న కలెక్టరేట్ ముట్టడి ఉంటుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్మికులను ఉద్దేశించి నాయకులు ఎస్.సాంబశివయ్య, బి.గోపీనాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీస వేతనాలు పెంచుతామని, కొత్త పిఆర్‌సి అమలు చేస్తామని, కాంట్రాక్టు కార్మికులను ఆరు నెలల్లోపు పర్మినెంట్ చేస్తామని, పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని, దళారీ వ్యవస్థను తొలగిస్తామని హామీలిచ్చారని



గుర్తుచేశారు. నాలుగున్నరేళ్లయినా ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, లక్ష్మయ్య, రామయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఈనెల 20, 21 తేదీల్లో పురపాలక కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు చేమయనున్నట్లు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధారా కోటేశ్వరరావు, పెంచల ప్రసాద్, ప్రభావతి, లక్ష్మి, పెంచలయ్య పాల్గొన్నారు.

ముగిసిన మహిళా ఉపకులపతుల సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్

హర్యానా రాష్ట్రం గుర్గావ్‌లో ఐఐఎల్ఎం, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సంయుక్తంగా నిర్వహించిన ఉన్నత విద్య జాతీయ మహిళా వీసీల సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం ఉన్నత విద్యలో మహిళా న్యాయకత్వం అనే అంశం మీద వీసీలు సమర్థవంతంగా విధి నిర్వహణ, న్యాయకత్వ ఆచరణ, యూనివర్సిటీని సమాజాన్ని ముందుకు తీసుకెళ్లటం గురించి చర్చించారని మహిళా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.భారతి 'ప్రజాశక్తి'కి తెలిపారు. అమెరికా, ఆస్ట్రేలియా



అధికార ప్రతినిధులతో చర్చలలో పాల్గొని అవగాహన ఒప్పందాల గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్లోరియా మినిస్టర్ కౌన్సిలర్ యుఎస్ ఎంబసీ, మౌనిక కెనడి మినిస్టర్ కౌన్సిలర్ ఆస్ట్రేలియా ఎంబసీ పాల్గొన్నారు.

5వ తేదీకల్లా శ్రీనివాస సేతు పూర్తవ్వాలి : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీనివాస సేతు నిర్మాణ పనులు ఆగష్టు 5వ తేదీకి పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం టీటీడీ పరిపాల భవనంలోని తన ఛాంబర్ లో టీటీడీ, మున్సిపల్ అధికారులతో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన గడ్డర్స్ ఏర్పాటు తదితర పనుల ప్రక్రియ వేగవంతం చేసి ఆగష్టు 5 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ హరితను కోరారు. రోడ్లకు ఇరువైపులా మీడియన్స్, డ్రైనేజి, డివైడర్లు, సుందరీకరణ, తారు రోడ్డు పనులను ఏకకాలంలో చేపట్టాలన్నారు. నిర్మాణ పనులకు



అడ్డంకిగా వున్నభూగర్భంలోని విద్యుత్ వైర్లను తొలగించేందుకు తగినంత మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి సంతోష్ రావును కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ భూమన్ అభినయ్ రెడ్డి, జేఈ వో సదా భార్గవి, సిఈ నాగేశ్వరరావు, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

స్విమ్స్ లో డయాలసిస్ రోగులకు మందుల వితరణ

తిరుపతి సిటి : స్విమ్స్ నెఫ్రో ఫ్లస్ విభాగం ఆధ్వర్యంలో డయాలసిస్ చేసుకొంటున్న పేషంట్లకు శ్రీ వెంకటేశ్వర ఎ.పి. స్టేట్ కిడ్నీ పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటరామయ్య బుధవారం వేల రూపాయల విలువ గల మందులను విరాళంగా అందించారు . స్విమ్స్ సం చాలకులు, ఉపకులపతి సదా భార్గవి ద్వారా ఈ విరాళం అందించారు. ఈ కార్యక్రమంలోడాక్టర్. శివకుమార్, డాక్టర్. కోటిరెడ్డి, డయాలసిస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ఆర్.డి. నాగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనకు కేరాఫ్ శ్రీబాబా విద్యానికేతన్

ప్రజాశక్తి-తిరుపతి సిటి



పాఠశాలను ప్రారంభించి 30 ఏళ్ల అనుభవం కల్గి.. నాటి నుంచి మేటిగా, ఉత్తమ విద్యా ప్రమాణాలతో నాణ్యమైన విద్యను బోధించి, విద్యార్థులకు ఉత్తమ ప్రమాణాలతో ఉన్నత లక్ష్యాలకు బాటలు వేస్తోందని అధినేత డాక్టరు ఎల్.రమేష్‌బాబు తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడలోని జీఎస్ఆర్ లేఅవుట్‌లో ఉన్న ఆ స్కూల్ ప్రాంగణంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ గత 30 ఏళ్ల క్రితం ఈ పాఠశాలను ప్రారంభించినప్పుడు పదుల సంఖ్యలో విద్యార్థులతో అడ్మిషన్ నిర్వహించామన్నారు. నేడు చాలా మంది విద్యార్థులు వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరి జీవితంలో స్థిరపడ్డారని, ఇది చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. నిరంతరం శ్రమతో, అకుంఠిత దీక్ష, ఉత్తమ ప్రణాళికలతో పోటీ విద్యారంగంలో రాణించడం కఠోర కార్యచరణతో కూడుకున్నదన్నారు. 2023 సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించడమే కాకుండా, తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబర్చారన్నారు. తమ పాఠశాలలో విద్యతో పాటు సంస్కృత సాంప్రదాయాల్లో ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించి, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అంచెలంచులుగా కంప్యూటర్ శిక్షణ, స్కిల్‌డెవలప్‌మెంట్, స్పోకన్ ఇంగ్లీష్, ఇలా విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన ప్రతి ఒక అంశాన్ని పాఠశాలలో అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు



9866232640 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు...
- ఐఐటిలో ఉత్తమ శిక్షణ.
- దీర్ఘానుభవంతో ప్రత్యేక పర్యవేక్షణ.
- ఫలితాల్లో రాష్ట్రస్థాయి ప్రతిభ.
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం.
- అహ్లాదకరమైన వాతావరణం.

శక్తివంచన లేకుండా సేవచేస్తున్నాం: చెవిరెడ్డి లక్ష్మి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి శక్తివంచన లేకుండా సేవ చేస్తున్నామని చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి అన్నారు. మంగళ, బుధవారాల్లో మంగళం పంచాయతీలో మోడల్ కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, బిటిఆర్‌పురంలో ఇంటింటికి ప్రచార పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా నారా చంద్రబాబునాయుడు కాలనీ, మంగళం క్వార్టర్స్ లో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన అభివద్ధి కార్యక్రమాలు, కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న సమయంలో రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఆనందయ్య మందు, ఇంటింటికి



పౌష్టికాహారాల పంపిణీ, శరీర రోగ నిరోధక శక్తి పెరగడానికి ఉచితంగా మందులను అందించామని స్థానిక ప్రజలకు వివరించారు. 2024 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోటీ చేస్తున్నారని, అఖండ మెజారిటీతో గెలిపించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీపీ చిలమంద మునికష్ణయ్య మాట్లాడుతూ మంగళం ప్రాంతం అభివద్ధికి ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎంతగానో సహకరిస్తూ నిధులు మంజూరు చేశారని, ఆ కారణంగానే ఈరోజు ప్రతి కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం, సిసి డ్రెయిన్లు నిర్మిత మయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండలం వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, మంగళం డివిజన్ వైసీపీ అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, మంగళం పంచాయతీ వైసిపి ఇన్ చార్జి చిలమంద హరికష్ణ, రణధీరపురం గ్రామపంచాయతీ వైసీపీ ఇన్ చార్జి పీఎం లక్ష్మీనారాయణ, తిరుమల నగర్ గ్రామపంచాయతీ వైసిపి ఇన్ చార్జి గుండ్రాజు శివశంకర్ రాజు, సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీ వైసిపి ఇన్ చార్జి వసంతు అశోక్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు గుణశేఖర్ రెడ్డి, సుధాయాదవ్, బత్తల గోపి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు

మండలాన్ని ప్రగతి పథంలో నడిపిద్దాం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మండలాన్ని ప్రగతి పథంలో నడిపిద్దామని ఎంపీపీ పద్మప్రియ, ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమతమ శాఖలో జరిగిన ప్రగతిని వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలని అధికారుల దష్టికి తీసుకువచ్చారు. అనంతరం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి అన్ని పథకాలు అందేలా చూడాలని తెలిపారు. బతలవల్లం సెక్రటరీ పద్మనాభ రాజు రద్దయిన ఆర్టీసీ బస్సులపై వివరణ కోరగా స్పందించిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు అవసరం ఉన్న సమయంలో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, ఏవో సుహర్లత, మండల విద్యాశాఖ అధికారిణి సరస్వతి, సీడీపీవో దేవ కుమారి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో మహిళలకు భద్రత కరువు



నిరసన తెలుపుతున్న తెలుగుదేశం పార్టీ మహిళలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జగన్ పాలనలో మహిళలకు భద్రత కరువైందని టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉష బుధవారం విమర్శించారు. ఆ పార్టీ మహిళా అధ్యక్షురాలు, మాజీ శాసనసభ్యురాలు వంగళపూడి అనితపై వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడం, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా స్థానిక పెండ్లి మండపం వద్ద తెలుగు మహిళలు నిరసన తెలిపారు. పోలీసులు అడ్డుకుని వారిని అరెస్ట్ చేసి వన్ టౌన్ స్టేషన్‌కు తరలించారు. కృష్ణవేణి, సుమతి, దుర్గమ్మ, శ్రీలక్ష్మి, కుమారి, సుజాత, సరోజనమ్మ, అనిత, సుభాషిణి తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

'ఆర్థిక అక్షరాస్యత'పై అవగాహన

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు, చిల్లకూరు మండలాల్లోని చెన్నూరు, చిల్లకూరులలో సహకార బ్యాంక్ మేనేజర్ సత్యవతి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ సత్యవతి మాట్లాడుతూ, జిల్లా సహకార బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ శంకర్ బాబు, సహకార బ్యాంక్ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆదేశాలతో చెన్నూరు, చిల్లకూరులో రమేష్ కళాబందం వారిచే వీధి నాటక ప్రదర్శన చేసి సహకార బ్యాంక్ ప్రయోజనాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది నారాయణ రెడ్డి, రాజ, కళాజాత బందం సుబ్బరాజు, రాజ రమేష్ రైతులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలని స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ ఎల్ శరవన్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో బ్యాంక్ జాతీయ దినోత్సవం వేడుకలను బ్రాంచ్ మేనేజర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ పలు డిమాండ్లు కలిగిన ఫ్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ ప్రెసిడెంట్ మునిరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై శిక్షణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో ప్రముఖ శ్రీ సిటీ-మోండలేజ్ చాక్లెట్ తయారీ కంపెనీ, సేవ్ ద చిల్డ్రన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య, సంక్షేమ కేంద్రం ఆరోగ్య కార్యకర్తలకు లింగ సమానత్వం, ఆరోగ్య సంక్షేమ కార్యకర్తల పాత్ర, బాధ్యత అనే విషయాలపై క్షుణ్ణంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వికాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ వైద్యాధికారులు మాధవి, దివాకర్, సిహెచ్ఓ వెంకటేషులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధి హామీ పనుల కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం తణుకు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా అంబుడ్స్ పర్సన్ శ్రీ రాస రాయ రాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనికి వంద రోజులు కచ్చితంగా రావాలని, కనీస వేతనం రూ.272 వచ్చేలా మార్కింగ్ ఇచ్చి పని చేయమని ఉపాధి హామీ సిబ్బందితో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మండల ఏపీఓ భార్గవి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

డాక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-నాగలాపురం: మండల ప్రజలకు కరోనా కాలంలో మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన డాక్టర్ నాగరాజు అని తోటి సిబ్బంది ఆయన్ను కొనియాడారు. నాగలాపురం ప్రజలకు 6 సంవత్సరాలు మెరుగైన వైద్యం అందించి సాధారణ బదిలీలో భాగంగా పాపానాయుడుపేటకు బదిలీపై వెళ్లిన డాక్టర్ నాగరాజుని బుధవారం వైద్య సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజేష్, విజయ్, సిహెచ్ఓ వేణుగోపాల్, సూపర్‌వైజర్ మంజులవాణి, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ జ్యోతి కుమారస్వామి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విశ్వ భారతి జ్ఞాన జ్యోతి ట్రస్ట్ ద్వారా తిరుపతి డాక్టర్ల ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక 20వ వార్డులో క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, వారికి ఉచితంగా మందులు అందించారు. మున్సిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్ ఛైర్మన్ డి.జయ ప్రకాష్, వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు, బాలాజీ, డాక్టర్ హేమంత్ కుమార్, భార్గవి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం: మంత్రి



రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన దేశానికే కాక ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్ రావులు ప్రారంభించి దుకాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి చిల్లకూరు జాతీయ రహదారి వద్ద ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్, మేరిగా మురళి లు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో అన్ని వసతులతో నూతన రైతు బజార్‌ను నిర్మించి ప్రజలకు అంకితం చేయడం ఆనందంగా ఉందన్నారు. రైతు బజార్‌లో సబ్సిడీ టమోటా పంపిణీ కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్ రావులు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పి ఛైర్మన్ ఆనం అరుణమ్మ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ దేవసేనమ్మ, ఏఎంసీ ఛైర్మన్ యమునమ్మ, వైస్ ఛైర్మన్ గోవర్ధన్, జడ్పీటీసీ యామిని, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ లు కొడూరు కల్పలత, యారం మంజుల తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి పత్రం అందజేత

గూడూరు రైతు బజార్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి చిల్లకూరు మండల వ్యవసాయ శాఖ సహాయకులు వినతి పత్రం అందజేసి తమ సమస్యలను తెలియజేశారు. వ్యవసాయ శాఖ సహాయకులు వెంకటకష్ణయ్య మాట్లాడుతూ పాత పద్ధతిలోనే ఈ పంట నమోదు కొనసాగించాలని మంత్రికి వినతి పత్రం అందజేశామని, ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అమరరాజా సంస్థని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్



బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్‌తో అమరరాజా సంస్థ సిబ్బంది

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీలో గల అమరరాజా ఫ్యాక్టరీని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ బందం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ మాట్లాడుతూ అమరరాజా వివిధ రంగాలలో, విలువలతో కూడిన వ్యాపారాన్ని చేస్తూ మంచి పురోగతిని సాధిస్తున్నట్లు తెలిపారు. మా సందర్శన ముఖ్య ఉద్దేశ్యం అమరరాజా సంస్థతో కలిసి ఎనర్జీ రంగంలో మేము పనిచేయడానికి వ్యాపార అవకాశాలను పరిశీలిస్తున్నామని, ముఖ్యంగా మొబిలిటీ గ్రీన్ ఎనర్జీ రంగాలలో అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం అమరరాజా బ్యాటరీస్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులు నాయుడు మాట్లాడుతూ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ అమరరాజా సంస్థని సందర్శించడం తమకు చాలా సంతోషదాయకమని, ఇలాంటి సందర్శనలతో తమ సంస్థ ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా తెలియటానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వరుణ్ మాలి, బ్రిటీష్ డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్, నళిని రఘురామన్, బ్రిటిష్ రాజకీయ ఆర్థిక సలహాదారు, అమరరాజా బాటిల్స్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులు నాయుడు, లిథియం బ్యాటరీ ప్లాంట్ ఆపరేషన్స్ అండ్ ప్రాజెక్ట్ హెడ్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై నిరంతర పర్యవేక్షణ : కమిషనర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : పన్ను బకాయిలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, పన్నుల వ్యత్యాసాల్లో తేడాలు ఉంటే సరిదిద్దాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కమిషనర్ ఛాంబర్లో బుధవారం రెవెన్యూ, ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్నులు కరెక్టు విలువ ప్రకారమే విధిస్తున్నారా? లేదా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. జగనన్న భూహక్కు రీసర్వే పనులను పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేషన్ నుంచి రెసిడెన్షియల్ కిందపన్నులు చెల్లిస్తూ ఎవరైనా కమర్షియల్ కింద నడుపుకుంటుంటే అలాంటివాటిపై సర్వే నిర్వహించి పన్నులు సవరించాలన్నారు. అనధికార హోర్డింగులు, ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

తాతానగర్‌లో సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని అంతర్గత మార్గాలన్నింటిని ఆధునికరించి నూతన సిసి, బిటి రోడ్లుగా ప్రారంభిస్తున్నామని ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. తిరుపతి నగరంలోని తాతానగర్లో సిసి రోడ్డును, కాలువలను బుధవారం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ తాతానగర్లో గంగమ్మగుడి కూడలి నుండి ప్రశాంత్ స్కూల్ వరకు సిసి రోడ్డును, పెద్ద కాలువను 67.20 లక్షల వ్యయంతో నిర్మించి ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డిఈ దేవిక, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, జల్లి తులసీ యాదవ్, ఈతమాకుల సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

టిడిపి భరోసా బస్సు యాత్రకు నీరాజనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నందమూరి తారక రామారావు శతజయంతి నాడు మొదలైన భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నదని, బస్సు యాత్రలో తెలుగుదేశం పార్టీ హామీలకు జనం నీరాజనాలు పలికారని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు బస్సులతో రాష్ట్రంలోని 125 నియోజకవర్గాలను కలుపుతూ ఈ బస్సు యాత్ర సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రుద్రకోటి సదాశివం, వేణుగోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రీ' డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ డిగ్రీ కళాశాలలో ప్రీ డిగ్రీ (ఇంటర్), డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ప్రీ డిగ్రీలో సంస్కృతం, తెలుగు, హిందీ కోర్సులకు 18 ఏళ్ల లోపు వయసు కలిగి ఎస్ఎస్‌సి లేదా తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు అర్హులు. మూడేళ్ల సంస్కృతం, తెలుగు, హిందీ కోర్సులకు 21 సంవత్సరాల లోపు వయసు కలిగి ప్రీ డిగ్రీ, ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కె.టి. రోడ్డులోని కళాశాల కార్యాలయంలో రూ.25 చెల్లించి దరఖాస్తులు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 31వ తేదీలోపు సమర్పించాలి. ప్రవేశం లభించిన విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పిస్తారు. ఇతర వివరాలకు 0877 – 2264604, 0877 – 2263974 నంబర్లను సంప్రదించగలరని వెల్లడించారు.

శ్రీసిటీని సందర్శించిన ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ



ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీని స్వాగతిస్తున్న శ్రీసిటీ ఎండీ

ప్రజాశక్తి-సత్యవేడు : ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీఎస్పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావ్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన పరిశ్రమల విద్యుత్ వినియోగంపై సమీక్ష చేశారు. పరిశ్రమల ప్రతినిధులు తమ దష్టికి తీసుకొచ్చిన విద్యుత్ అంతరాయం, వోల్టేజ్ సమస్యలు, పెరిగిన విద్యుత్, ట్రూ ఆప్ చార్జీలు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంబంధిత సమస్యలపై చర్చించారు. చర్చకు వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు సీఎండీకి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కతజ్ఞతలు తెలిపారు. సీఎండీతో పాటు సీజీఎం (ఫైనాన్స్) ధర్మజ్ఞాని, సీజీఎం (ఆపరేషన్స్) గురవయ్య, తిరుపతి సూపరింటెండెంట్ ఇంజనీర్ కష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

ప్రజాశక్తి-బాలాయపల్లి: అధికారపార్టీ నాయకుల అండదండలతో 500 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టి తరలించిన సంఘటన బుధవారం మండలంలోని కరిమనగుంట చెరువులో చోటుచేసుకుంది. ఏపీ ప్రజా సంఘాల అధ్యక్షుడు తలరి కోటయ్య సమాచారం మేరకు వెలుగులోకి వచ్చింది. కరిమనగుంట గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న చెరువు మట్టిని కాట్రగుంట గ్రామానికి వైసిపి నాయకుడు ఇటుక బట్టీ కోసం అధికారులు అండదండలతో బహిరంగంగానే జేసీబీతో తవ్వకాలు జరిపి ట్రాక్టర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క ట్రాక్టర్ ట్రిప్పు మట్టి విలువ రూ.3 నుంచి రూ.5వేల పలుకుతున్నట్లు సమాచారం.



ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

ఇటుక బట్టీలకు తరలింపు: చెరువులో తవ్విన మట్టిని కాట్రగుంట గ్రామ సమీపం వద్ద ఇటుకబట్టీకి తరలిస్తున్నట్లు సమాచారం. చెరువులు రక్షించాలని ప్రభుత్వం ఒక పక్క చెబుతుంటే అక్రమార్కులు మాత్రం చెరువు మట్టిని అక్షయ పాత్రగా భావించి లక్షలాది రూపాయలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు కింద భూములున్న రైతులు మట్టి అక్రమ తరలింపు వల్ల తమ భూములకు సాగునీరు అందకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. కాగా మట్టి అక్రమ తరలింపుపై సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెరువు మట్టి అక్రమ తరలింపును నిలుపుదల చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

అనుమతులు లేవు: తహశీల్దార్

మండలంలోని కరిమనుకుంట చెరువు నుంచి మట్టి తోలేందుకు ఎటువంటి అనుమతులు లేవు. అక్రమంగా మట్టి తోలేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాసులు చెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం సిరుగు రాజుపాలెం పంచాయతీలోని పొట్టి గ్రామంలో డ్రైనేజీ కాలువలు నిండిపోవడంతో సర్పంచ్ మురళీమోహన్ పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీ కాలువలోని చెత్తను బుధవారం తొలగించారు. అలాగే రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, రోడ్డులో గుంతలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

లెప్రసీపై ప్రత్యేక సర్వే

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే కార్యక్రమాన్ని వైద్యాధికారులు శశికళ, మధు బాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ, నొప్పి లేని మచ్చలు, చర్మంపై వాచిన, ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు వంటి లక్షణాలుంటే వెంటనే అందుబాటులోని వైద్యాధికారులని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఫిజియోథెరపిస్ట్ వెంకటరమణ, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, ఆశ చిట్టమ్మ పాల్గొన్నారు.

జగనన్న తోడు ఓ బూటకం!



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చిన్న, చిన్న పెట్టుబడులతో వీధులలో తిరుగుతూ వ్యాపారాలు చేసుకునే వారికి భారీ ఎత్తున ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నట్లు తన సొంత మీడియాలో డబ్బా కొట్టుకుంటూ ప్రకటనల రూపంలో రూ.వందల కోట్లు ఖర్చు పెడుతున్న సీఎం ప్రవేశ పెట్టిన 'జగనన్న తోడు' పథకం ఓ బూటకం అని టీడీపీ నాయకులు బుధవారం ఆరోపించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలోని వీధి వ్యాపారస్తులకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి స్వానిధి' పేరుతో అమలు చేస్తున్న పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో 'జగనన్న తోడు' పథకంగా జగన్మోహన్ రెడ్డి మార్చుకొని ప్రచారం చేసుకోవడం దిగజారుడు వ్యక్తిత్వానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిరు వ్యాపారులకు ఉపయోగపడే ఈ పథకాన్ని వైసిపి నాయకులు కబ్జా చేసి 90 శాతం తమ వారికి ఇచ్చుకున్నారని ఆరోపించారు. చిరు వ్యాపారులను గుర్తించి, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల అర్హులైన వారు రుణాలు పొందలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దశరధాచారి, మిన్నల్ రవి, బుజ్జి, ఉమేష్ రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని పుత్తూరు వేద వ్యాస స్కూల్‌లో బుధవారం కేకేసీ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేకేసీ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పద్మజ, మంజుల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కేకేసీ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో సుమారు 130 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ముని లోకేష్, పంచకర్మ డాక్టర్ వి.చిత్ర, స్కూల్ వ్యవస్థాపకురాలు బాల సరస్వతి పాల్గొన్నారు..

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కోట: మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలో గల చంద్రశేఖరపురం సచివాలయ కేంద్రంలో గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో భవాని చేతుల మీదుగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కిరణ్ కుమార్, చిట్టేడు పంచాయతీ సెక్రటరీ సుమలత, స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రత్నయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని సచివాలయ కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ, కొత్తపట్నం ఉప సర్పంచ్ ఉప్పల ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఉప్పల శేషయ్య గౌడ్, వీఆర్వో శ్రీనివాసులు, వైఎస్సార్ కాంతి పథకం సిబ్బంది ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రెడ్డి ఆశయం అని వైసీపీ నాయకులు వడ్ల తంగళ్ బాలాజీ ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టిఎంవి కండ్రిగ గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. చుక్కల నిడిగల్లు ఉపసర్పంచ్ ఎల్లయ్య, టిఎంవి కండ్రిగ పంచాయతీ కార్యదర్శి హేమశ్రీ, వీఆర్వో వెంకటచలపతి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి నివాళి



ఉపాధ్యాయుని భౌతిక కాయానికి టీడీపీ జెండా కప్పుతున్న పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి-ఎర్రావారిపాలెం: మండలంలోని చింతకుంట పంచాయతీ పసుపులేటివారిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు, సీనియర్ టిడిపి నాయకులు రమేష్ గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. దీంతో సమాచారం తెలుసుకున్న చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తినాని సతీమణి పులివర్తి సుధారెడ్డి, రమేష్ స్వగ్రామానికి విచ్చేసి ఆయన భౌతికకాయానికి టిడిపి జెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు.

అంతర్రాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్ల అరెస్ట్



ఎర్రచందనం దుంగలను, నిందితులను చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారి, భాకరాపేట ఘాట్ రోడ్‌లో బుధవారం ఉదయం భాకరాపేట సిఐ తులసీరామ్, ఎస్సైలు ప్రకాష్ కుమార్, వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో జరిపిన దాడిలో నలుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను చుట్టుముట్టి అరెస్టు చేసినట్టు సిఐ తెలిపారు. అనంతరం సిఐ మాట్లాడుతూ పట్టుబడిన జె.జయరాజ్(29), ఆర్.భరత్(35), సి.గోకుల్ మారన్(30),ఎ.శరవణన్(39)లు తమిళనాడు వాసులుగా గుర్తించామన్నారు. వీరు ఘాట్ రోడ్డులో ఐషర్ వాహనంలో రూ.41.53 లక్షల విలువ గల 1051 కేజీల 42 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ముద్దాయిలలో ఇద్దరిపై ఇప్పటికే మన రాష్ట్రంలో పాత కేసులు ఉన్నాయని, ఎ1 రాజ్ కుమార్ పై నాలుగు ఎర్రచందనం కేసులు, ఎ2 భరత్ పై రెండు ఎర్రచందనం కేసులు నమోదైనట్లు తెలిసిందన్నారు. మిగిలిన ఇద్దరిపై కూడా పక్క జిల్లాలలో గానీ, ఇతర రాష్ట్రాల్లో గానీ ఏమైనా కేసులు నమోదయ్యాయా అని ఆరా తీస్తున్నామన్నారు. వీరు ఎర్రచందన దుంగలను కోడూరు నుంచి చెన్నైకి తరలించాలనే ఉద్దేశ్యంతో హైవే మార్గంలో ఎక్కువ తనిఖీలు ఉన్నందున పట్టుబడుతామని భావించి, ప్రత్యామ్నాయ మార్గంగా భాకరపేట దారిని ఎంచుకుని వయా భాకరాపేట, పాకాల, పెనుమూరు మీదుగా రవాణా చేసేందుకు వ్యూహం రచించారని తెలిపారు. ఈ ముఠాకు ప్రధాన సూత్రధారి శేఖర్ (చెన్నై) అని, వీరికి మార్గదర్శకత్వం చేసిన మరొక ముద్దాయి రమేష్ (తిరువన్నామలై) జిల్లా వాసి. ఈ ముద్దాయిలిద్దరూ ప్రస్తుతం పరారీలో ఉన్నారని తెలిపారు. వీరందరూ ఎర్రచందన దుంగలను శేషాచలం అడవి ప్రాంతంలో నరికించి తమిళనాడు రాష్ట్రానికి అక్కడి నుండి విదేశాలకు తరలించే వారని ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన భాకరాపేట సర్కిల్ సీఐ ఎం.తులసీరామ్, ఎస్ఐలు ప్రకాష్ కుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది గురుస్వామి, చరణ్‌కుమార్, ప్రసాద్ ఏఆర్ పిసి, బాలసుబ్రమణ్యంలను జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

చెన్నేరి ఫామ్ హౌస్ స్థల యజమానిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి గ్రామానికి సమీపంలో కొనసాగుతున్న వ్యవసాయ క్షేత్ర అభివద్ధికి సంబంధించి స్థల యజమాని నాగేంద్రపై సంబంధిత పంచాయతీ సెక్రటరీ రమణమూర్తి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పంచాయతీ తాగునీటి పైపులైన్‌ను తొలగించి వేరే చోటికి మార్చినందుకు రమణ మూర్తి ఫామ్ హౌస్ యజమానిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెన్నేరి గ్రామానికి సమీపంలో జగనన్న కాలనీలో 84 పక్కా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకుగాను అవసరమైన నీటి వసతిని కల్పించాలనే ఉద్దేశ్యంతో దాసుకుప్పం పంచాయతీ సర్పంచ్ రవి రెడ్డి చొరవతో పంచాయతీ అధికారులు నూతన బోరుతోపాటు పైప్ లైన్ వేశారన్నారు. అయితే జగనన్న కాలనీకి పక్కనే చెన్నైకి చెందిన నాగేంద్ర వ్యవసాయ క్షేత్రాన్ని అభివద్ధి చేస్తున్న నేపథ్యంలో ఫామ్ హౌస్ యజమాని నాగేంద్ర మూడో కంటికి తెలియకుండా పంచాయతీ పైపులైను తొలగించి దూరంగా వేసినట్లు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.